
JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి I గురువారం 02-10-2025
Medchal - Malkajgiri I Thuesday 02-10-2025
jayabherinews
సంపుటి : 02 I సంచిక : 127 I పేజీలు : 8 I వెల : 5
Vol. 02 I Issue 127 I Pages : 8 I ₹: 5




పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు,
శ్రేయోభిలాషులకు "దసరా" పండుగ శుభాకాంక్షలు
దసరా సందర్భంగా నేడు (02-10-2025) మా ఆఫీస్ కు సెలవు.
కావున శుక్రవారం (03-10-2025) సంచిక వెలువడదు. పునర్దర్శనం శనివారం
మోతె రఘు తిరుపతి రెడ్డి, సిఎండి, జయభేరి దినపత్రిక



# రైతులంటే బిజెపికి చిన్న చూపు

- గోధుమలకో నీతి.. వడ్లకో నీతి ఉంటుందా..?
- బీజేపీ సర్కార్‌పై హరీశ్ రావు ఫైర్

**దక్షిణ భారత దేశం అంటే కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి చిన్నచూపు అని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. గోధుమలకు మద్దతు ధర పెంచి, వడ్లకు పెంచలేదు. గోధుమలకో నీతి, వడ్లకో నీతి ఉంటుందా? అని నిప్పులు చెరిగారు. సిద్దిపేట బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.**

జయభేరి, హైదరాబాద్ :

బిజెపి ప్రభుత్వం ఎప్పుడు దక్షిణ భారతదేశాన్ని చిన్నచూపు చూస్తున్నది. గోధుమల మద్దతు ధర పెంచారు సంతోషం. దక్షిణ భారత దేశంలో పండే వడ్లకు ఎందుకు మద్దతు ధర పెంచరు. క్వింటాల్ గోధుమలకు 160 మద్దతు ధర పెంచి రూ. 2585కు బిజెపి ప్రభుత్వం నిర్ణయించింది. వరి విషయంలో మాత్రం 69 రూపాయలు పెంచి రూ. 2369కు మాత్రమే నిర్ణయించారు.
గోధుమలకు ఒక నీతి.. వరికో నీతి ఎందుకు? అని నిలదీశారు. ఉత్తర భారత దేశ రైతులకు ఒక నీతి దక్షిణ భారతదేశ రైతులకు ఒక నీతి. ఎందుకు దక్షిణ భారతదేశ రైతులంటే బిజెపికి చిన్న చూపు. గోధుమలతో సమానంగా వరికి మద్దతు ధర ఇవ్వాలని బిజెపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. తెలంగాణ నుండి ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది బీజేపీ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి వరికి మద్దతు ధర పెంచాలి.
ఆరుగాలం కష్టపడే రైతు పట్ల ఎందుకు అంత వివక్ష. తెలంగాణలో మెజార్టీగా వరి పండుతుంది. దేశంలో అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ. అతి ఎక్కువ నష్టం తెలంగాణకే జరుగుతున్నది. క్వింటాల్‌కు రూ. 220 నష్టం జరుగుతుంది. ఎకరానికి 30 క్వింటాల్స్ పండితే ఎకరానికి రూ. 7000లు తెలంగాణ రైతులు నష్టపోతున్నారు. గోధుమలకు ఇచ్చినట్టు వరికి కూడా మద్దతు ధర సమానంగా ఇస్తే తెలంగాణలో రైతులకు ఎకరానికి రూ. 7000లు లాభం జరుగుతుంది. తెలంగాణ బిజెపి ఎంపీలారా.. రైతుల పక్షాన నిలబడతారా? కేంద్రానికి కొమ్ము కాస్తారా? అని హరీశ్‌రావు నిలదీశారు.



## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు పెన్షనర్లకు గుడ్ న్యూస్


- జూలై నుంచి వర్తింపు..
- అక్టోబర్ వేతనంతో కలిపి చెల్లింపు

జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 1:

కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు, పెన్షనర్లకు దీపావళి కానుకగా 3 శాతం డియర్‌నెస్ అలవెన్స్ (డీఏ) పెంపును ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర కేబినెట్ బుధవారం ఈ నిర్ణయాన్ని తీసుకుంది. ఈ నిర్ణయం వల్ల డీఏ 55 శాతం నుంచి 58 శాతానికి పెరుగుతుంది. జులై 1, 2025 నుంచి వర్తింపు చేస్తారు. ఈ పెంపు 1.2 కోట్ల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రయోజనం చేకూర్చనుంది. ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.10,084 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా. ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియా సమావేశంలో ఈ విషయాన్ని ప్రకటించారు. ఈ పెంపు ద్వారా జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల ఎరియర్స్ ను అక్టోబర్ వేతనంతో లెక్కిం చి చెల్లిస్తారు. మొదటి మూడు నెలల్లోనే రూ.6,000 కోట్లకు పైగా అదనపు డబ్బు ఉద్యోగుల ఖాతాల్లోకి జమ చేస్తారు. దీపావళి పండుగ సమయంలో ఈ అదనపు ఆదాయం ప్రజలకు భారీ ఊరటను కల్పిస్తుందని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేసింది. డీఏ పెంపును కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రియల్ వర్కర్స్ (సీపీఐఐడబ్ల్యూ)

...మిగతాది 2 లో

# 15 నెలల్లో 4,71,574 మందికి ఉద్యోగాలిచ్చాం




**"స్త్రీ శక్తి" పథకం కింద ఆగస్టు 15న ప్రారంభించిన ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కేవలం 45 రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా 10 కోట్ల మంది మహిళలు వినియోగించుకున్నారని తెలిపారు. డ్వాక్రా సంఘాలను తీసుకొచ్చిందే తెలుగుదేశం ప్రభుత్వమని గుర్తుచేశారు.రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని చంద్రబాబు అన్నారు.**

జయభేరి, విజయనగరం :

ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా తమ ప్రభుత్వం ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని, మానవతా దృక్పథంతో సంక్షేమ పాలన అందిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. విజయనగరం జిల్లా దత్తి గ్రామంలో నిర్వహించిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని, లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.ప్రతి నెలా ఒక గ్రామానికి నేరుగా వచ్చి పింఛన్ల పంపిణీని పర్యవేక్షిస్తున్నానని, అందులో భాగంగానే దత్తి గ్రామానికి వచ్చానని చంద్రబాబు తెలిపారు. దేశంలోని 29 రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రంలో కేవలం రూ.500 మాత్రమే పింఛను ఇస్తున్నారని, కానీ ఏపీలో మాత్రం తాము అత్యధికంగా అందిస్తున్నామని పోల్చి చెప్పారు. రాష్ట్రంలో ప్రతి వంద మందిలో 13 మందికి పింఛను అందుతోందని, అందులో 59 శాతం మహిళలేనని వివరించారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన "సూపర్ సిక్స్" పథకాలను సూపర్ హిట్ చేశామని, అన్ని హామీలను అమలు చేస్తున్నామని ఆయన అన్నారు. మహిళల కష్టాలు తీర్చేందుకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా...

...మిగతాది 2 లో



## యుద్ధాల్లో సాంకేతికత పెరిగింది

జయభేరి, న్యూఢిల్లీ, అక్టోబరు 1 :

ప్రస్తుత యుద్ధాల్లో ఆధునిక సాంకేతికత వినియోగం ఆందోళనకరంగా పెరుగుతోందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. డిఫెన్స్ అకౌంట్స్ డిపార్టుమెంట్ 278వ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన ప్రసంగిస్తూ, భారత రక్షణ రంగంలో పరిశోధన, అభివృద్ధిని బలోపేతం చేయడానికి ఒక వినూత్నమైన పర్యావరణ వ్యవస్థను రూపొందించనున్నట్లు వెల్లడించారు.యుద్ధాల్లో ఆధునిక సాంకేతికత వినియోగం పెరగడంపై రాజ్‌నాథ్ సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. అత్యాధునిక సాంకేతికతలు సంవత్సరాల తరబడి పరిశోధన మరియు అభివృద్ధి ఫలితంగా రూపొందించబడినవని ఆయన పేర్కొన్నారు. మనం కూడా ఈ సాంకేతికతను అందిపుచ్చుకోవలసిన అవసరం ఉందని ఆయన అన్నారు. మన చుట్టూ ఉన్న పరిస్థితులు మారుతున్నాయని, దేశ భద్రతా అవసరాలు కూడా పెరుగుతున్నాయని

...మిగతాది 2 లో




## బతుకమ్మ నిర్వహణ మహిళలకు అవమానం



జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 1:

బతుకమ్మ వేడుకల్లో గిన్నిస్ రికార్డ్ కోసం విచిత్ర వింత పోకడలకు పోవటం దురదృష్టకరమని.. మొదటి నుంచి తెలంగాణ సాంస్కృతిని కాపాడుకునేందుకు ఆరాట పడిన సంస్థ జాగృతి అని కవిత తెలిపారు. హైదరాబాద్ లో మీడియా సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. కేవలం పదివేల మందితో ప్రభుత్వం నిర్వహించిన బతుకమ్మ పండుగ మహిళలను అవమానించినట్లే ఉందని.. వచ్చే సంవత్సరం జాగృతి ఆధ్వర్యంలో లక్ష మందితో బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తామని ప్రకటించారు. గిన్నిస్ రికార్డ్ తో ఇది మహిళల పండుగ అని నిరూపిస్తామన్నారు.

...మిగతాది 2 లో



▶▶ మొదటిపేజీ తరువాయి

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు..

ఆధారంగా లెక్కిస్తారు. లేబర్ బ్యూరో ప్రతి నెలా విడుదల చేసే ఈ ఇండెక్స్‌ను 12 నెలల సగటు తీసి, 7వ వేతన కమిషన్ ఫార్ములా ప్రకారం లెక్కిస్తారు. ఏడాదికి రెండుసార్లు (జనవరి, జూలై) ఈ పెంపు ప్రకటిస్తారు . ఈ 3% పెంపు 33 లక్షల మంది కేంద్ర ఉద్యోగులు, 66 లక్షల మంది పెన్షనర్లకు (మొత్తం 99 లక్షల మంది) ప్రయోజనం చేకూరుస్తుంది.

**ఉదాహరణకు:** ఎంట్రీ లెవల్ ఉద్యోగి (బేసిక్ పే రూ.18,000): ప్రస్తుతం డీఏ రూ.9,900 (55%). పెంపు తర్వాత రూ.10,440 (58%) - నెలకు రూ.540 అదనం. ఏడాదికి రూ.6,480. మిడ్‌లెవల్ (బేసిక్ పే రూ.30,000): అదనం రూ.900 నెలకు. సీనియర్ లెవల్ (బేసిక్ పే రూ.1 లక్ష): అదనం రూ.3,000 నెలకు. 8వ వేతన కమిషన్: ఎప్పుడు అమలు? జనవరి 2025లో 8వ వేతన కమిషన్ ప్రకటన చేశారు, కానీ టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్ (టిఓఆర్) లేదా సభ్యుల నియామకం జరగలేదు. 2026 చివరి లేదా 2027 ప్రారంభంలో మాత్రమే అమలు కావచ్చు.


## యుద్ధాల్లో సాంకేతికత పెరిగింది

రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.ఈ కారణంగానే రక్షణ బడ్జెట్ ప్రతి సంవత్సరం పెరుగుతోందని ఆయన అన్నారు. బడ్జెట్ పెరుగుతున్నందున, దానిని సద్వినియోగం చేసుకోవలసిన బాధ్యత కూడా రెట్టింపు అవుతుందని ఆయన స్పష్టం చేశారు. సాంకేతిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆయన నొక్కి చెప్పారు. దేశీయ సాంకేతిక వ్యవస్థను అభివృద్ధి చేయడానికి నిధులను పెంచుతున్నట్లు ఆయన తెలిపారు.

## బతుకమ్మ నిర్వహణ మహిళలకు..

ప్రభుత్వం మళ్లీ చేస్తే ఆ మరుసటి సంవత్సరం దాన్ని మించి చేస్తామన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా చింతమడక నుంచి లండన్ వరకు పలు ప్రాంతాలు తిరిగానన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చి బతుకమ్మ లేకుండా చేశారని.. తెలంగాణ ద్రోహి తెలంగాణ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని మండిపడ్డారు. జై తెలంగాణ అనని సీఎం బతుకమ్మ నిమజ్జనంలో పాల్గొన్నారని విమర్శించారు. రికార్డ్ కోసం బతుకమ్మ చేశారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఈ పండుగను నిలబెట్టుకున్నారు. మేము ఎప్పుడు రికార్డుల కోసం పండుగ నిర్వహించ లేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే కోటి బతుకమ్మలా జాతర చేశామని.. బొడ్డెమ్మ ల నుంచి కోటి బతుకమ్మల వరకు 28 రోజుల పాటు చేశాం. రికార్డుల కోసం కాదన్నారు. తెలంగాణ సాధన కోసం మాత్రమే చేశామని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం కూడా ఆ విధంగా నిర్వహించి... బతుకమ్మకు బతుకమ్మ చీరలు ఇచ్చి ఉంటే బాగుండేదన్నారు. మహిళలకు ఏదైనా మంచి జరిగేలా కార్యక్రమం చేయాల్సి ఉందని.. కానీ చేయలేదన్నారు. తెలంగాణ తల్లి బొమ్మ ఎవరు పెట్టారంటే తెలంగాణ ప్రజలు అని మత్రమే రావాలి. రేవంత్ రెడ్డి అని రాకూడదన్నారు. రాజకీయపరమైన రిజర్వేషన్ బిల్లు మీద మాత్రం సమస్యలు వస్తున్నాయని..కేసులు వేసిన వ్యక్తులు రేవంత్ రెడ్డి దగ్గర వ్యక్తులని చాలా మంది చెబుతున్నారన్నారు. వీళ్లేమో ఇలా కేసులు వేస్తారు..ఇక రాష్ట్రపతి వద్ద బిల్లును పాస్ చేయించాల్సిన బీజేపీ వాళ్లు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తారన్నారు. ఈటల రాజేందర్ ఎన్నికలకు వెళ్లవద్దు, డబ్బులు ఖర్చు పెట్టుకోవద్దు అని అంటారు. ఎన్నికల రిజల్ట్స్ వచ్చిన తర్వాత కూడా మేము క్యాన్సిల్ చేయిస్తామని అంటారు. ఈటల, బీజేపీ పార్టీ వాళ్లు కోర్టులా, జడ్జిలా అని ప్రశ్నించారు. మీ అధ్యక్షుడు జీవోను స్వాగతిస్తున్నా అంటాడు. ఈటల మాత్రం వేరేగా మాట్లాడుతారు. అసలు ఒక ఉద్యమకారుడిగా పేరున్న ఈటల ఇలా మాట్లాడవచ్చా? బీసీ బిడ్డ అయిన మీరు అలా మాట్లాడతారా తక్షణమే మీరు క్లారిఫికేషన్ ఇవ్వాలన్నారు. ఇక్కడున్న ఎనిమిది మంది ఎంపీలు వెళ్లి మోడీ కాళ్లు పట్టుకోని రిజర్వేషన్లు తెప్పించాలని సూచించారు. గ్రామ పంచాయితీల వారీగా మీ కులగణనను బయట పెట్టండి అని మేము డిమాండ్ చేస్తున్నామని.. ఇవ్వాళ బీజేపీ మీద బాధ్యత ఉంది. బీసీ బిల్లు పాస్ చేస్తారో లేదో చెప్పాలన్నారు. బీసీ లకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు వస్తే...ఆ తర్వాత చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం పోరాడుతాం. రెండేళ్ల పాటు కాళేశ్వరం రిపేర్ చేయకుండా రైతులకు నీళ్లు ఇవ్వకుండా ప్రభుత్వం ఎండబెట్టింది. ఆ ఉసురు ఊరుకే పోదు. కచ్చితంగా కాంగ్రెస్ కు తగులుతుందని హెచ్చరించారు.

## వినియోగదారులకు షాక్.. గ్యాస్ సిలిండర్ ధర పెంపు



జయభేరి, న్యూఢిల్లీ, అక్టోబర్ 1 :

దసరా పండగ ముందు వాణిజ్య గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు చమురు మార్కెటింగ్ కంపెనీలు షాకిచ్చాయి. బుధవారం గ్యాస్ సిలిండర్ ధరలు పెంచుతున్నట్లు ప్రకటించాయి. 19 కిలోల వాణిజ్య LPG సిలిండర్ ధరపై రూ.15.50 పెంచారు. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధర ఇప్పుడు రూ.1,595.50కి చేరుకుంది. పెరిగిన ధరలు ఇవాళ్టి నుంచే అమలులోకి వస్తాయని తెలిపాయి. దీంతో హోటళ్ళు, రెస్టారెంట్లు, వాణిజ్య వంట గ్యాస్‌పై ఎక్కువగా ఆధారపడే పలు వ్యాపారాలపై ప్రభావం పడనుంది. ఇక, గృహ సిలిండర్ల ధరల్లో ఎలాంటి మార్పు లేదు. వాణిజ్య రేట్లలో పెరుగుదల సర్దుబాటు ఉన్నప్పటికీ 14.2 కిలోల దేశీయ LPG సిలిండర్ల ధరలు ప్రస్తుతానికి స్థిరంగా ఉన్నాయి.

## ఫిలిప్పీన్స్‌లో భారీ భూకంపం.. 31 మంది మృతి

జయభేరి, మనీలా, అక్టోబర్ 1:

ఫిలిప్పీన్స్‌లో భారీ భూకంపం సంభవించింది. దీంతో తీవ్ర ప్రాణనష్టం, ఆస్థి నష్టం జరిగింది. మంగళవారం అర్థరాత్రి ఫిలిప్పీన్స్‌లో రిక్టర్ స్కేలుపై 6.9 తీవ్రతతో భూ ప్రకంపనలు సంభవించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ భూ ప్రకంపనలతో దాదాపు 31 మందికి పైగా మరణించగా.. అనేక మంది గాయపడినట్లు తెలిపారు. అలాగే పలు భవనాలు, ఇళ్లు ధ్వంసమయ్యాయి. భూప్రకంపనలతో తీవ్ర భయాందోళనలతో ప్రజలు ఇళ్ళ నుండి బయటకు పరుగులు పెట్టారు. తీవ్రమైన ప్రకంపనల కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని అధికారులు తెలిపారు. ఫిబ్రవరి నుంచి లక్ష డాలర్ల ఫీజు సెబు ప్రావిన్స్‌లోని బోగోకు ఈశాన్యంగా 17 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఏర్పడినట్లు అధికారులు తెలిపారు. దాదాపు 90,000 మంది జనాభా నివసించే ఈ తీరప్రాంత నగరంలో 14 మంది మృతి చెందినట్లు విపత్తుఉపశమన అధికారి రెక్స్ వైగోట్ అసోసియేటెడ్ చెప్పారు. బోగోలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. భారీ భూ ప్రకంపనలు కారణంగా పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటంతో కొంతమంది మరణించగా.. మరికొంతమంది గాయపడినట్లు అధికారులు చెప్పారు. గాయపడిన వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం సంఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

# ఐక్యరాజ్యసమితి పెద్దరికం ఏమైంది


**ప్రపంచంలో అశాంతి పడగవిప్పి బుసలు కొడుతున్నది. గాజాలో రక్తపాతమైనా, ఇజ్రాయిల్‌హమాస్‌ల పోరాటమైనా, ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడులైనా, భారత్‌లోని పహల్గాంలో పాక్ ఉగ్రవాదులు సాగించిన నరమేథమైనా, రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య సంవత్సరాల తరబడి కొనసాగుతున్న భీకర యుద్ధం ఇలా ఏదీ తీసుకున్నా ప్రపంచంలో అశాంతి పవనాలు వీచేలా చేస్తున్నాయి.**




అమెరికా అ ధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన లక్ష్యసాధన కోసం ప్రపంచ దేశాలపై అధిక సుంకాలు విధించి ట్రేడ్ వార్‌కు తెర తీశారు. నేపాల్ వంటి దేశాలు ప్రజాగ్రహజ్వాలల్లో చిక్కుకున్నాయి. గతంలో శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో ప్రజల తిరుగుబాటుతో ప్రభుత్వాలే పతనమయ్యాయి. ఈ దెబ్బకు ప్రపంచంలో పలు దేశాలు ఆర్థికంగా చితికిపోయాయి. ఒక వైపు యుద్ధాలతో.. మ రో వైపు అగ్రరాజ్యాల ఆధిపత్య ధోరణులతో ప్రపంచ శాంతికి తీవ్ర విఘాతం కలు గుతున్నది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపుల పర్వం.. భారత్‌కు చైనాను దగ్గరయ్యేలా చేసింది. మూడు బలమైన దేశాలైన భారత్, రష్యా, చైనాలు ఏకమైతే అమెరికాకు దీర్ఘకాలంలో ఎదురయ్యే సమస్యల గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. బ్రిక్స్ దేశాల బలోపేతం ఏక ధృవ ప్రపంచ విచ్ఛిన్నానికి మార్గం సుగమం చేస్తుంది. ట్రంప్ విధిస్తున్న టారిఫ్‌ల వల్ల ప్రపంచ వాణిజ్య రంగం అతలాకుతలం కావడమే కాకుండా ట్రేడ్ వార్ వల్ల వివిధ దేశాల మధ్య సం బంధాలు దెబ్బతింటున్నాయి. ఇటీవల ఖతార్‌పై ఇజ్రాయిల్ ఆకస్మికంగా వైమానిక దాడులు జరపడం ఆశ్చర్యం కలి గించింది. దీంతో వర్తమాన ప్రపంచం అశాంతికి నిలయంలా మారిపోయింది .ఈ పరిస్థితులను ఇలాగే వదిలేస్తే మూడో ప్రపంచ యుద్ధాన్ని ఏరికోరి ఆ హ్వానించడమే అవుతుంది. శాంతి భద్రతలు కరువైతే యుద్ధోన్మాదం విలయతాండవం చేయక తప్పదు. ఎక్కడైతే శాంతి సుస్థిరతలకు భంగం వాటిల్లుతుందో, అక్క డ అభివృద్ధి కుంటుపడుతుంది. ఇప్పటి వరకు జరిగిన యుద్ధాలు, పలుదేశాల మధ్య సంఘర్షణలు ఈ విషయాన్ని స్ప ష్టంగా తెలియజేసున్నాయి. ప్రపంచంలోని ఇప్పటికీ చాలా దేశాల్లో ప్రజలు జీవించడానికి కనీస మౌలిక సదుపాయాలు లేవు. ఆకలి, దరిద్రం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, అవినీతి వంటి పలు అంశాలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. మూలిగే నక్కపై తాటి పండు పడిన చందంగా సామ్రాజ్య విస్తరణ కోసం వివిధ దేశాల మధ్య జరిగే యు ద్ధాల వలన ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇక భా రతదేశం కూడా అనేక దండయాత్రలకు గురైంది. స్వాతంత్ర్యానంతరం కూడా చైనా, పాకిస్తాన్ దేశాలతో భారతదేశం అనేక ఇబ్బందులకు గురికావడం చూస్తునే ఉన్నాం. భారతదేశం ప్రపంచంలో అత్యధిక జనాభా గల ప్రజాస్వామ్య దేశం. అణ్వస్త్ర సామర్థ్యం కలిగిన బాధ్యతాయుతమైన దేశం. ప్రపంచ దేశాలతో వి స్తృ తమైన వాణిజ్య సంబంధాలు కలిగి, 4.19 ట్రిలియన్ డాలర్లతో నాల్గవ బలమైన ఆర్థిక వ్యవస్థగా అవతరించిన భారత్‌కు ఇతర దేశాల సమస్యలను పరిష్కరించగల నేర్పు, ఓర్పు ఉన్నాయి. అం దుకే రష్యా, ఉక్రెయిన్ల మధ్య యుద్ధాన్ని నిలువరించడానికి భారత్ మధ్యవర్తిత్వం వహించాలని కొన్ని ప్రపంచ దేశాలు భావిస్తున్నాయి. రష్యా చమురును కొనుగోలు చేసే దేశాల్లో భారత్ ముందు వరుసలో ఉంది. అందువల్లే రష్యా, ఉక్రెయిన్ల మధ్య యుద్ధ విరమణకు మన దేశం పూర్తి స్థాయిలో చొరవ తీసుకునే అవకాశం ఉండడం లేదు.రష్యా వద్ద భారత్ చమురు కొనుగోలు చేయడమే ఉక్రెయిన్, రష్యాల మధ్య యుద్ధ విరమణ జరగకపోవడానికి కారణమని ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలు అర్ధ రహితం. నోబెల్ శాంతి బహుమతి కోసం ఆరాటపడుతున్న రష్యా, ఉక్రెయిన్ యుద్ధం విషయంలో మాత్రం ఏం చేయలేకపోతున్నారు. అయితే ఈ ఏడాది చి వర్లో లేదా వచ్చే ఏడాది ప్రథమార్థంలో ర ష్యా, ఉక్రెయిన్ యుద్ధానికి చరమగీతం పాడే అవకాశముంది. ఇదే గనుక జరిగితే ప్ర పంచం ఒక గండం నుంచి బయటపడిన ట్లే. ఇక భారత్ భవిష్యత్తులో ప్రపంచంలో శాంతి స్థాపన విషయంలో కీలక భూమిక పోషించే అవకాశముంది. పాలస్తీనా విషయంలో భారత్ తన విదేశాంగ విధానం మార్చుకుని ఇజ్రాయిల్‌కు మద్దతు పలకడాన్ని పలు రాజకీయ పక్షాలు ఇప్పటి వ రకు విమర్శించాయి. అయితే గాజాపై ఇ జ్రాయిల్ జరుపుతున్న దాడులకు వ్యతిరేకంగా, పాలస్తీనాకు మద్దతుగా ఇటీవల ఐ క్యరాజ్య సమితిలో భారత్ ఓటు వేయడం గమనార్హం. భారత్ శాంతి కాముక దేశమ ని ఈ పరిణామం నిరూపించింది. ప్ర పంచ వ్యాప్తంగా భారత్‌కు పెరుగుతున్న ఆ దరణ దృష్ట్యా.. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు వీటో హక్కు దక్కాల్సిన అవసరముంది. ఐక్యరాజ్య సమితి ఆ విర్భావ సమయంలో 51 దేశాలకు సభ్యత్వముంటే ఇప్పుడా సంఖ్య 193కు పె రిగింది. భద్రతా మండలిలో 15 సభ్య దేశాలుంటే.. వీటిలో అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్, బ్రిటన్‌లు శాశ్వత సభ్య దేశాలుగా అధికారం చెలాయిస్తుండడంతో ఐక్యరాజ్యసమితి ప్రేక్షక పాత్రలా మారిపోయింది. ప్రపంచంలో శాంతి స్థాపనే ధ్యేయంగా ఉ న్నత ఆశయాలతో ఏర్పడిన ఐరాస సంస్థ ఇలా నిస్తేజంగా మారడం ఘోరవైఫల్యం కింద లెక్కకట్టొచ్చు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య బద్దంగా ఎన్నికైన హసీనా ప్రభుత్వాన్ని కూల్చినప్పుడు ప్రపంచ దేశాల ను శాసిస్తున్న పెద్దరికం ఎక్కడికి పోయింది? గాజా విషయంలో ఐక్యరాజ్యసమితి పాత్ర ఎంత? దశాబ్దాల తరబడి భా రత్ పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదంతో యుద్ధం చేస్తున్నా మౌనంగా ఉండడంపై ఐరాస సమాధానం చెప్పాల్సిందే. ప్రస్తుత ప్రపంచ పోకడలు అత్యంత ప్రమాదకరంగా తయారయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ సమస్యల పరిష్కారం విషయంలో భారత్‌కు తగిన ప్రాధాన్యత ఇ వ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న వి షయం తెలుసుకోవాలి.

# 15 నెలల్లో 4,71,574 మందికి ఉద్యోగాలిచ్చాం

ఇస్తున్నట్లు ప్రకటించారు. "స్త్రీ శక్తి" పథకం కింద ఆగస్టు 15న ప్రారంభించిన ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కేవలం 45 రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా 10 కోట్ల మంది మహిళలు వినియోగించుకున్నారని తెలిపారు. డ్వాక్రా సంఘాలను తీసుకొచ్చిందే తెలుగుదేశం ప్రభుత్వమని గుర్తుచేశారు.రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని చంద్రబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం విజయనగరం జిల్లా గజపతినగరం మండలం దత్తి గ్రామంలో 'పేదల సేవలో' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు నేరుగా పెన్షన్లు అందజేశారు. కిడ్నీ వ్యాధిగ్రస్తుడు పొంతూరు అప్పలరాజు ఇంటికెళ్లి పింఛను అందించారు. 'సూపర్ సిక్స్ సూపర్ హిట్'గా మారిందని, దేశంలోనే అతిపెద్ద సంక్షేమ కార్యక్రమమని ముఖ్యమంత్రి తెలిపారు. ఉదయం 11 గంటలకే రాష్ట్రవ్యాప్తంగా 82 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తయ్యిందని అధికారులు తెలిపారు.విశాఖపట్నం నుంచి హెలికాప్టర్‌లో దత్తి గ్రామానికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రజ వేదికలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో ప్రసంగించారు. గ్రామంలోని వృద్ధులు, వికలాంగులు, వితంతువులు తదితరులకు ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల సమస్యలు విన్నారు. ఎన్‌టీఆర్ భరోసా పథకం ద్వారా ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. "అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్లు అందిస్తున్నాం. 63 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నాం. హెల్త్ ఇన్సూరెన్స్ కూడా తీసుకొచ్చాం" అని చెప్పారు. ఏటా రూ.32,143 కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు.గత వైసీపీ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. తమ ప్రభుత్వం ప్రజాభివృద్ధికి కట్టుబడి ఉందని చెప్పారు. పెన్షన్ పెంచడం, ఒకటో తేదీ సెలవు రోజు ముందు రోజు పంపిణీ చేయడం వంటి చర్యలు దేశ చరిత్రలో మొదటిసారి అంటూ ప్రస్తావించారు. "పేదల సేవ దేవుని సేవ" అనే సూత్రంతో పని చేస్తున్నామని, ఈ పథకం పేదలకు అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. దేశంలో 29 రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్‌లో కేవలం రూ.500 పెన్షను మాత్రమే ఇస్తున్నారని, ఆంధ్రంలో మాత్రం వందలో 13 మందికి (59% మహిళలు) పెన్షన్లు అందుతున్నాయని వివరించారు.ఒక్క పెన్షన్లతోనే సరిపోకుండా 'సూపర్ సిక్స్ సూపర్ హిట్' పథకాలన్నీ అమలు చేశామని చెప్పారు. దీపం పథకం ద్వారా గ్యాస్ సిలిండర్లు అందించామని, ఇప్పుడు ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు ఇస్తున్నామని తెలిపారు.స్త్రీ శక్తి పథకం కింద ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, 45 రోజుల్లో 10 కోట్ల మంది



మహిళలు ప్రయోజనం పొందారని పేర్కొన్నారు. "రాష్ట్రంలో ఎక్కడికైనా ప్రయాణం చేయవచ్చు" అని గుర్తు చేశారు. ఆదాయాన్ని పెంచడంపై దృష్టి సారించిన సీఎం, "రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది. రైతు ఆదాయం పెరగాలి" అని అన్నారు. ఒకప్పుడు రైతును పట్టించుకోలేదని, ఆహారపు అలవాట్లు మారాలని సూచించారు. విజయనగరం జిల్లా పేదరికంలో ఉందని, తగిన సాగునీరు లేదని, కానీ కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందని తెలిపారు. రైతు భరోసా పథకం కింద ఇప్పటికే ఒక్కొక్క రైతుకు రూ.6 వేలు వేశామని, మరో రూ.14 వేలు వేస్తామని ప్రకటించారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని, ఏడాదిలోనే మెగా డీఎస్సీ నిర్వహించామని చెప్పారు. "యువతకు అండగా ఉంటా. ఉద్యోగాలు కల్పించే బాధ్యత నాది" అని స్పష్టం చేశారు. ఇప్పటికే రైతు భరోసా కింద ప్రతి రైతుకు రూ.6,000 జమ చేశామని, త్వరలోనే మరో రూ.14,000 అందిస్తామని హామీ ఇచ్చారు. యువతకు ఉద్యోగాలు కల్పించే బాధ్యత తనదని చెబుతూ, ఏడాదిలోనే మెగా డీఎస్సీ నిర్వహించామన్నారు. ఈ 15 నెలల్లో 4,71,574 మందికి ఉద్యోగాలిచ్చామని తెలిపారు. రాష్ట్రానికి ఇప్పటికే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, వీటి ద్వారా 9 లక్షల ఉద్యోగాలు వస్తాయని సీఎం ధీమా వ్యక్తం చేశారు.

# రేగడి చిలకమర్రి గ్రామస్తులకు తీరబోతున్న డ్రైనేజీ కష్టాలు

- రేగడి చిలకమర్రి బొబ్బిలిగామ మధ్యలో గల వాగులపై వంతెనల సమస్య
- మురుగునీరు సమస్యలకు ఉపశమనం
- రేగడి చిలకమర్రి డ్రైనేజీ కల్వర్టు రెండు గ్రామాల వాగులను పరిశీలించిన డిసిసి రంగారెడ్డి ఉపాధ్యక్షులు జితేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పురుషోత్తం రెడ్డి
- డ్రైనేజీ సమస్య రేగడి చిలకమర్రి-బొబ్బిలిగామ మధ్యలో గల రెండు వాగుల వలన సమస్య గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన గ్రామస్తులు
- తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే శంకర్ సుమారు 250 మీటర్ల ఓపెన్ నాలా కి 15 లక్షల రూపాయలు ప్రతిపాదన
- రెండు వంతెనలకు 60 లక్షల రూపాయల ప్రతిపాదన
- అభివృద్ధి పట్ల హర్షం వ్యక్తం చేసిన రేగడి చిలకమర్రి గ్రామస్తులు





**జయభేరి, షాద్ నగర్, అక్టోబర్ 01 :**

మురుగునీరు పేరుకుపోయి దుర్వాసనతో ప్రజలు ముక్కు మూసుకుని వెళ్లే పరిస్థితి ఏర్పడిందని రేగడి చిలకమర్రి, బొబ్బిలిగామ మధ్యలో గల వాగుల సమస్య గురించి గతంలో శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ గారి దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లడం జరిగింది. దీనికి వెంటనే స్పందించిన శాసనసభ్యులు వీటికి సంబంధించిన నిధుల కోసం అంచనాలను అధికారులతో సిద్ధం చేయించి ప్రభుత్వానికి మంజూరు కోసం ప్రతిపాదనలు పంపడం జరిగింది. రేగడి చిలకమర్రి గ్రామంలో తప్పుడు పాండు ఇంటి నుండి శ్రీవారికుంట వరకు మురుగునీరు వల్ల దుర్వాసన రావడంతో ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారని అదే విధంగా రేగడి చిలక మర్రి బొబ్బిలిగామ మధ్యలో వర్షాకాల సమయంలో ప్రజలు మరియు రైతుల రాకపోకల కోసం తీవ్ర అంతరాయం కలుగుతుందని ఈ సమస్యని గ్రామస్తులు తెలిపిన వెంటనే అనుమతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేసిన శాసనసభ్యులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు ఇందిరమ్మ కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి హామీ

**జయభేరి, ఉప్పల్ :**

అంతర్జాతీయ సీనియర్ సిటిజన్ దినోత్సవం సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి సీనియర్ పౌరుల సంక్షేమం కోసం ప్రత్యేక కృషి చేస్తానని హామీ ఇచ్చారు. డాక్టర్ ఏఎస్ రావు నగర్ సీనియర్ సిటిజన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. "సీనియర్ సిటిజెన్లు సమాజానికి దారి చూపించే మార్గదర్శకులు. మీకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా నన్ను నిస్సంకోచంగా సంప్రదించండి. ఆరోగ్య సమస్యలు తలెత్తితే సంబంధిత అధికారులతో చర్చించి, మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తాను" అని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డిని సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రతినిధులు జ్ఞాపికను అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే హామీతో సీనియర్ సిటిజెన్లు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ నాయకులు రామానుజం, దయానంద్, ఠాగూర్ వెంకట్రామిరెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



హైదరాబాద్ కుషాయిగూడలో జలందర్ రెడ్డి ఫర్నిచర్ టౌన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్, మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావుతో కలిసి ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. వ్యాపార రంగంలో రాణించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**జయభేరి, కాప్రా**



## దసరా శుభాకాంక్షలు

- ఉప్పల్ నియోజకవర్గ ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి.

**జయభేరి, ఉప్పల్ :**

మనిషి తనలోని చెడు మీద నిత్యపోరాటం చేస్తూ మంచి దిశగా విజయం సాధించాలనే జీవన తాత్వికతను విజయ దశమి మనకు తెలియజేస్తుందని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు అన్నారు. దసరా నాడు శుభసూచకంగా పాలపిట్టను దర్శించి, శమీ వృక్షానికి పూజ చేసి, జమ్మి ఆకును బంగారంలా భావించి పెద్దలకు సమర్పించుకుని వారి ఆశీర్వాదం తీసుకోవడం, గొప్ప భారతీయ సాంస్కృతిక ఆచారమని పేర్కొన్నారు. ఉప్పల్ ప్రజల జీవితాల్లో దసరా పండుగకు ప్రత్యేక స్థానమున్నదని అన్నారు. అలాయ్ బలాయి తీసుకుని పరస్పర ప్రేమాభిమానాలను పంచుకోవడం ద్వారా దసరా పండుగ సందర్భంగా ప్రజల నడుమ సామాజిక సామరస్యం పరిడవిల్లుతుందని అన్నారు. ప్రజలు తాము నిర్వర్తించే వృత్తులకు సంబంధించిన ఉత్పత్తి పరికరాలను, వినియోగించే వాహనాలను ఆయుధ పూజ చేసి గౌరవించుకునే గొప్ప సంప్రదాయం దసరా ప్రత్యేకతగా ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## ఆయుధ.. వాహన పూజల్లో పాల్గొన్న పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం

**జయభేరి, కరీంనగర్:**

కమీషనరేట్ కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్ నందు దసరా పండగ సందర్బంగా నిర్వహించిన ఆయుధ, జమ్మి మరియు వాహన పూజా కార్యక్రమాల్లో పోలీసు కమీషనర్ గౌష్ ఆలం పాల్గొన్నారు. ఈ సందర్బంగా పోలీసు కమీషనర్ మాట్లాడుతూ. కమీషనరేట్ ప్రజలకు దసరా పండగ శుభాకాంక్షలు తెలిపారు. కమీషనరేట్ ప్రజలంతా, ఆయురారోగ్యాలతో ఉండాలని పోలీసు కమీషనర్ గౌష్ ఆలం ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఏ.ఆర్. భీం రావు, ఏసీపీలు విజయ్ కుమార్ రిజర్వు ఇన్స్పెక్టర్లు లు రజినీకాంత్, జానీమియా, శ్రీధర్ రెడ్డి , కిరణ్ కుమార్, సిఐలు శ్రీనివాస్, రాంచందర్ రావు, సృజన్ రెడ్డి, బిల్లా కోటేశ్వర్ , సరిలాల్ లతో పాటు ఇతర పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకం

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, కాప్రా :**



కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ ఇందిరా నగర్ (నాగార్జున నగర్ )లో బుధవారం జరిగిన కాలనీ సంక్షేమ సంఘం కమ్యూనిటీ హాల్ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరానగర్ కుటుంబాల భాగస్వామ్యంతో నిర్మాణం పూర్తి చేసుకున్న కమ్యూనిటీ హాలు ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కాలనీ అభివృద్ధి కోసం అవసరమైన నిధులను మంజూరు అయ్యేలా చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. ఇందిరానగర్ చైతన్య వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శి వర్గం సభ్యులు బివి నరసింహారెడ్డి, శివారెడ్డి, కృష్ణారెడ్డి, భాస్కరాచారి, శ్రీనివాస్ రెడ్డి, రాం ప్రసాద్, వెంకట్రావు, సారా అనిల్ ముదిరాజ్ తదితజరులు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి శాలువా కప్పి సత్కరించారు. .ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య CCS అధ్యక్షులు ఎంపల్లి పద్మారెడ్డి,నాయకులు నేమురి మహేష్‌గౌడ్, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, గంప కృష్ణ, సారా వినోద్ ముదిరాజ్, ఎస్ ఏ రహీం, మొగిలి రాఘవరెడ్డి గడ్డల పాండు మన్నే నరేష్ యావపురం రవి దాసరి కనకయ్య శ్రీశైలం రాధాకృష్ణమూర్తి, నాగేశ్వరరావు బిక్షపతి గౌడ్ కృష్ణంరాజు జి. శ్రీనివాస్, జి మురళి, రమణ నాయక్ సీఎం రెడ్డి ఏ వెంకటేష్ నాగూర్ ఎస్ ఎం భాష, వెంకటేశ్వరరావు బి ప్రసాద్ రావు బాపూజీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దసరా సందర్భంగా బట్టలు.. చీరలు పంపిణి

- దసరా సందర్భంగా నిరుపేదలకు, మున్సిపల్ సిబ్బందికి బట్టలు చీరలు పంపిణి చేసిన మాజీ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి రవి గౌడ్, 2వ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ శెట్టి హరి కాంత్ గుప్తా దంపతులు...

**జయభేరి, మేడిపల్లి, సెప్టెంబర్ 01:**



తెలంగాణ రాష్ట్ర తొలి మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిల స్ఫూర్తితో దసరా సందర్భంగా నిరుపేదమహిళాలకు, బోడుప్పల్ కార్పొరేషన్ 1, 2, 3వ డివిజన్ల మున్సిపల్ సిబ్బందికి, సుమారు ఐదువందల మంది నిరుపేదమహిళాలకు బట్టలు పంపిణి చేసిన బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ సీనియర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కొత్త లక్ష్మి రవి గౌడ్,సాయి లక్ష్మి డవలపర్ అధినేత 2వ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ శెట్టి హరి కాంత్ గుప్తా .



ఈ సందర్బంగా కొత్త రవి గౌడ్ మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ నిరుపేద ప్రజలకోసం ఎంతో చేశాడని దసరా బతుకమ్మ పండగ చీరలు నిరుపేద మహిళాలకు ఇచ్చిన ఘనత గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ దే అని ఈ రోజు మాకు తోచినట్లు మా మాజీ మంత్రి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సహాయ సహకారంతో మా మున్సిపల్ సిబ్బందికి, మా డివిజన్లోని నిరుపేద మహిళాలకు సుమారు 500మందికి బట్టలు, చీరలు పంపణి చేయడం జరిగిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో 2వ డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దసరా ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు

- ముస్తాబైన ఉప్పల్ మున్సిపల్ స్టేడియం
- రావణ దహనకాండ, జమ్మి పూజ, సాంస్కృతిక కార్యక్రమాలు
- ఏర్పాట్లను పరిశీలించిన పరమేశ్వర్ రెడ్డి



**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ దసరా ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. దసరా ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను పరమేశ్వర్ రెడ్డి, దసరా ఉత్సవా సమితి సభ్యులు పషికంటి నాగరాజు, ఈగ ఆంజనేయులు ముదిరాజ్, లింగంపల్లి రామకృష్ణ, సల్లా ప్రభాకర్ రెడ్డి, గౌరిగ నగేష్ కురుమ, మంద మురళీకృష్ణ రెడ్డి, పూజారి హనుమంత్, బజారు నవీన్ గౌడ్, జిత్తు, బంటి బుధవారం పరిశీలించారు. దసరా సంబురాలను పురస్కరించుకొని గురువారం సాయంత్రం 6గంటలకు జమ్మి పూజ, రావణ దహనకాండ, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.

## వరల్డ్ సినీయర్ సిటిజన్స్ డే

- Dr దేప శ్రీనివాసరెడ్డి-సుజాత దంపతులకు సన్మానం




**జయభేరి, దేవరకొండ :**

వరల్డ్ సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా దేవరకొండ సినీయర్ సిటిజన్స్ ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నందు స్థానిక డాక్టర్ దేప శ్రీనివాసరెడ్డిసుజాత దంపతులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం దేవరకొండ, ఉమెన్స్ సినియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున పూలమాలలతో, షాలువాలతో, మెమంటో బహుకరించి సన్మానించడం జరిగినది. ఈ సందర్భంగా కార్యదర్శి అంకం చంద్రమౌళి, అధ్యక్షురాలు శ్రీమతి మాదిరెడ్డి సంధ్యారెడ్డి మాట్లాడుతూ గత 8 సంవత్సరాలనుండి డాక్టర్ ఎలాంటి ఫీజు లేకుండా బీదలకు, అందరికి పరీక్షలు చేసి మందులు వ్రాసి ఇస్తున్నారు. వారి సేవలను దేవరకొండ నియోజకవర్గం ప్రజలు, బీదవారు మరువలేరు అన్నారు. డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మీరు వృద్దులు అని బావించకండి రోజు నాలుగు లీటర్లు నీళ్లు త్రాగండి, రోజు ఒక గుడ్డు తినండి, మంచిగా వేలకు నిద్రపోండి, ఆలోచనలు తాగించుకోండి, ఆలోచనచేసి ఏమిలేదు ఇంకా 10 సంవత్సరాలు అదనంగా జీవించగలుగుతారు అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి వనం బుచ్చయ్య, అలంపల్లి శ్రీనివాస్, వార్డెన్ బలరాములు, దేప దామోదర్ రెడ్డి, చెరిపల్లి జయలక్ష్మి, రవిరాల చిట్టమ్మ, కేర్ టేకర్ జానకి, గంజి యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి శరన్నవరాత్రి మహోత్సవం ఆహ్వాన పత్రం

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి శరన్నవరాత్రి మహోత్సవ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ కి ఆహ్వాన పత్రంను పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు అందించారు. ఆహ్వాన పత్రం అందించిన వారిలో అధ్యక్షులు చీదెళ్ల వెంకటేశ్వర్లు, కార్యదర్శి సముద్రాల ప్రభాకర్ ,నీల రవికుమార్, ఇమ్మడి భద్రయ్య, కర్నాటి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## సొంత డబ్బులతో కల్వర్ట్‌ను నిర్మించిన బొడ్డు గోపాల్ గౌడ్




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండలం, తాటికొల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బొడ్డు గోపాల్ గౌడ్ అపారమైన మానవత్వంతో ఒక గొప్ప పని చేశారు. తాటికొల్ నుండి గుంటిపల్లికి వెళ్లే రహదారిలో రైతుల దీర్ఘకాలిక సమస్యను తీరుస్తూ, ఆయన తన సొంత డబ్బులు రూ. 2 లక్షల 10 వేలు ఖర్చు చేసి ఒక పెద్ద కల్వర్ట్ (చిన్న వంతెన)ను నిర్మించారు. ఈ కల్వర్ట్ నిర్మాణం వల్ల ఆ ప్రాంత రైతుల ఎన్నో సంవత్సరాల కల నెరవేరింది. గతంలో, రైతులు తమ పొలాలకు వెళ్లాలన్నా, పశువులను తీసుకుని వెళ్లాలన్నా, ఆ రహదారిలో ప్రవహించే నీటిని దాటుకుంటూ, ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ముఖ్యంగా వర్షాకాలంలో ఈ ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా ఉండేది. బొడ్డు గోపాల్ గౌడ్ ఈ సమస్యను గుర్తించి, స్వయంగా నిధులు సమకూర్చి కల్వర్ట్‌ను నిర్మించడం ద్వారా రైతులకు సురక్షితమైన దారిని కల్పించారు. దీంతో తమ కష్టాలు తీర్చిన గోపాల్ గౌడ్‌కు రైతులు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతూ, ఆయన చేసిన మహోపకారంపై హర్షం వ్యక్తం చేశారు. బొడ్డు గోపాల్ గౌడ్ సొంత ఖర్చుతో ఈ నిర్మాణం చేపట్టి మానవత్వాన్ని చాటుకున్నారు.

## ఎన్నికైన ఛైర్మెన్.. ధర్మ కర్తలు బాధ్యతతో కృషి చేయాలి

- నాచారం మహంకాళి దేవాలయం నూతన కమిటీని సన్మానించిన పరమేశ్వర్ రెడ్డి



**జయభేరి, ఉప్పల్ :**

నాచారం మహంకాళి దేవాలయం అభివృద్ధికి నూతనంగా ఎన్నికైన ఛైర్మెన్ ధర్మ కర్తలు బాధ్యతతో కృషి చేయాలని ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి కోరారు. బుధవారం ఉప్పల్ నియోజకవర్గ నాచారం మహంకాళి సహిత మహాకాళేశ్వర స్వామి దేవాలయం ఎండోమెంట్, ప్రభుత్వ సహకారంతో నూతన ఛైర్మన్ లను బుధవారం ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా మందముల పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. నూతనంగా దేవాలయ ఛైర్మన్ గా ఎన్నికైన వారు దేవాలయం అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. దేవాలయం అభివృద్ధికి పాటు పడాల్సిన అవసరం పాలక కమిటీకి ఉన్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి పదంలో ముందుకు సాగుతుందని పేర్కొన్నారు ఆలయాల అభివృద్ధికి సంక్షేమానికి ప్రభుత్వం ద్వారా నిధుల మంజూరుకు తాను తోడ్పడుతూ నాచారం ప్రజలు ఆకాంక్షించిన రీతిలో అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. రానున్న ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని ప్రజల భక్తుల అభీష్టం మేరకు నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలని కమిటీకి సూచించారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఎంతో గొప్ప పార్టీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అద్భుతమైన పాలన రాష్ట్రంలో జరుగుతుందని పరమేశ్వర్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆలయ ఛైర్మన్ గా మెతుకు శ్రీనివాస్ రెడ్డి, ధర్మకర్తలు,నెమలికొండ సునీల్ రెడ్డి, టి హెచ్ బాలరాజు, ఈ కృష్ణ యాదవ్, టీ ఉమ, తేనీరు రాకేష్, నర్సింగరావు, EO వెంకన్న, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ప్రకాష్ రెడ్డి, మాజీ ఛైర్మన్ కృష్ణారెడ్డి, మహేష్ యాదవ్, క్రాంతి కుమార్, రాజీ రెడ్డి, రోకేష్ నరేశ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## లిక్కర్ వాహనానికి విద్యుత్ షాక్

**జయభేరి, హైదరాబాద్ :**

రామంతాపూర్ లో కరెంట్ షాట్ ఆరుగురు వ్యక్తులు చనిపోయినా కూడా విద్యుత్ అధికారుల తీరు మారలేదు. రామంతపూర్ స్ట్రీట్ నెంబర్ 8 లో లిక్కర్ డీసీఎం లో షార్ట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగాయి. కరెంట్ వైర్ లు కిందికి ఉండడం తో లిక్కర్ డీసీఎం పక్కా నుండి వెళ్ళడం తో ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారంతో ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను అదుపు చేసారు. లిక్కర్ డీసీఎం లో ఉన్న లిక్కర్ బాటిల్స్ కొంతవరకు తగలబడ్డాయి.

# కవిత రాజీనామా ఆమోదానికి బ్రేక్




**జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 1:**

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. నిజామాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా కల్వకుంట్ల కవిత ఎన్నికయ్యారు. 2021లో ఆమె నిజామాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా గెలిచారు. నాడు బీఆర్ఎస్ అధికారంలో ఉండటంతో నిజామాబాద్ పరిధిలోని స్థానిక సంస్థలలో ఎక్కువ భాగం బీఆర్ఎస్ చేతిలోనే ఉండేవి. అలాగే ఎమ్మెల్యేలు కూడా ఎక్కువ సంఖ్యలో నాడు నిజామాబాద్ జిల్లాలో ఉన్నారు. దీంతో నిజామాబాద్ జిల్లా నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా కల్వకుంట్ల కవిత సులువుగా ఎన్నికయ్యారు. పెద్దల సభలోకి అడుగు పెట్టారు. అయితే ఆమె ఇటీవల బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి తాను రాజీనామా చేస్తున్నట్లు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. కవిత పదవీకాలం మరో రెండేళ్ల సయం ఉంది. స్పీకర్ ఫార్మాట్ లోనే రాజీనామా ఆమోదించినప్పటికీ కల్వకుంట్ల కవిత రాజీనామా మాత్రం ఆమోదం పొందలేదు.అలాగే పార్టీ పరంగా వచ్చిన ఎమ్మెల్సీ పదవికి కూడా తాను రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. బీఆర్ఎస్ తనను సస్పెండ్ చేయడంతో తనకు పార్టీ పరంగా వచ్చిన పదవులను కూడా వదులు కున్నారు. అయితే ఇంత వరకూ ఆమె రాజీనామా మాత్రం ఆమోదం పొందలేదు.

శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఇప్పటికే కల్వకుంట్ల కవితతో ఫోన్ లో మాట్లాడి ఆవేశంతో నిర్ణయం తీసుకోవద్దని, ఆలోచించి రాజీనామాపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. అయితే తాను ఆలోచించి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసినట్లు కల్వకుంట్ల కవిత చెప్పారని తెలిసింది. అయితే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ రాజీనామాను మాత్రం శాసనమండలి ఛైర్మన్ ఇప్పటి వరకూ ఆమోదించలేదు.తాజాగా స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ విడుదలయింది. ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను సాధించిన తర్వాత మాత్రమే ఆమె రాజీనామా ఆమోదం పొందుతుందన్న కామెంట్స్ బీఆర్ఎస్ నేతలే అంటున్నారు. ఇప్పుడు రాజీనామా ఆమోదించినా స్థానిక సంస్థలలో బీఆర్ఎస్ బలంగా ఉందని, అందుకే లోకల్ బాడీస్ ఎన్నికల తర్వాత కవిత రాజీనామా ఆమోదించే అవకాశముందని చెబుతున్నారు. మరొకవైపు పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సొంత జిల్లా కావడంతో ఈ ఎమ్మెల్సీ స్థానానికి బాగా ప్రాధాన్యత ఏర్పడింది. సెప్టెంబర్ 3వ తేదీన కల్వకుంట్ల కవిత రాజీనామా చేసినప్పటికీ ఇప్పటి వరకూ ఆమోదించలేదన్నది బీఆర్ఎస్ వర్గాల వాదన. మొత్తం మీద స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో ఇక ఫలితాల తర్వాత మాత్రమే రాజీనామా ఆమోదం పొందే అవకాశముందని అంటున్నారు. కవిత కూడా ఇదే రకమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు

**లండన్ లో సంచలన వ్యాఖ్యలు**

భారత రాష్ట్ర సమితి బహిష్కృత నేత.. జాగృతి అధినాయకురాలు కలవకుండా కవిత ప్రస్తుతం లండన్ లో ఉన్నారు. బతుకమ్మ సంబరాలలో పాల్గొంటున్నారు. ఇటీవల కాలంలో ఆమె తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో కేంద్ర బిందువుగా మారారు. రోజుకో తీరుగా సంచలన వ్యాఖ్యలు చేస్తూ తెలంగాణ రాజకీయాలను షేక్ చేస్తున్నారు.లండన్ లో జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కల్వకుంట్ల కవిత.. ఒకసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజలు కోరుకుంటే తాను పార్టీ పెడతానని స్పష్టం చేశారు. పార్టీ ఏర్పాటు విషయంలో తనకంటూ కొన్ని లక్ష్యాలు ఉన్నాయని కవిత వ్యాఖ్యానించారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉంది కాబట్టి పార్టీ ఏర్పాటు విషయంలో ఆమె ఆచితూచి నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే కొంతమంది నేతలతో ఆమె సమాలోచనలు జరిపారు. ఇటీవల కాలంలో కూడా తన నివాసంలో ముఖ్య కార్యకర్తలతో ఆమె వరుసగా సమావేశాలు కూడా నిర్వహించారు. ఆ సమావేశాలలో ఆమె రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తారని ప్రచారం జరిగినప్పటికీ.. అది కార్యరూపం దాల్చలేదు.

భారత రాష్ట్ర సమితిపై కూడా కల్వకుంట్ల కవిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 20 సంవత్సరాల పాటు తాను భారత రాష్ట్ర సమితిలో ఉన్నానని.. పార్టీ ఎదుగుదల కోసం తన కృషి చేశానని.. ఇప్పుడు ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేశారని కవిత వ్యాఖ్యానించారు. భారతీయ జనతా పార్టీ డిఎన్ఏ తనకు సరిపడదని.. కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లే ఉద్దేశం లేదని.. రాజకీయ కార్య క్షేత్రాన్ని ప్రజలు కోరుకున్న విధంగా ఏర్పాటు చేస్తానని కవిత పేర్కొన్నారు. కల్వకుంట్ల కవిత రాజకీయ పార్టీ పెడతారని మొన్నటి దాకా ప్రచారం జరిగిన నేపథ్యంలో.. కవితే నేరుగా స్పష్టం చేయడంతో.. ఇప్పట్లో ఆమె పార్టీ పెట్టే అవకాశాలు లేవని తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికీ సంచలన వ్యాఖ్యలతో మరోసారి కల్వకుంట్ల కవిత తెలంగాణ రాజకీయాలలో సంచలనంగా మారారు.

# తెలంగాణలో పింక్ బుక్ లేదు, రెడ్ బుక్ లేదు, బ్లూ బుక్ లేదు

- మాకు తెలిసిందల్లా ఖాకీ బుక్ మాత్రమే

**జయభేరి, హైదరాబాద్ ;**




సోషల్ మీడియాలో ఇష్టమొచ్చినట్లు కుటుంబ సభ్యులను కించపరిచేలా పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని డీజీపీ శివధర్ రెడ్డి హెచ్చరించారు. డీజీపీ గా నియమించినందుకు తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు. ఏ లక్ష్యంలో నన్ను నియమించారో అందుకు అనుగుణంగా పనిచేస్తామని అన్నారు. తెలంగాణలో పింక్ బుక్ లేదు, రెడ్ బుక్ లేదు, బ్లూ బుక్ లేదు. మాకు తెలిసిందల్లా ఖాకీ బుక్ మాత్రమే నని అన్నారు. లోకల్ బాడీ ఎన్నికలు మాకు మొదటి చాలెంజ్. శాంతియుతంగా ఎన్నికలు పూర్తి చేయడానికి సన్నద్ధం అవుతున్నాము . పోలీస్ శాఖలో 17000 ఖాళీలు ఉన్నాయి..ఆ నియామకాలు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటాం. బేసిక్ పోలీసింగ్ తో సాంకేతికను ఉపయోగించుకుని మరింత సమర్థవంతంగా పని చేస్తాము. మావోయిస్టులు పొలిట్ బ్యూరో మల్లోజుల వేణు గోపాల్ ఇటీవల ఒక ప్రకటన రిలీజ్ చేశారు. బయటకు రావడానికి, ఆయుదాలు వదిలి పెట్టడానికి నిర్ణయం తీసుకున్నాం అని ప్రకటన రిలీజ్ చేశారు. జనరల్ సెక్రటరీ బసవరాజు ఉన్నపుడే ఆ నిర్ణయం జరిగింది.. అని వేణుగోపాల్ ప్రకటనలో పేర్కొన్నారు . వేణుగోపాల్ ఇచిన స్టేట్ మెంట్ జగన్ ఖండించారు. ప్రజా పోరాట పంథా సక్సెస్ అవట్లేదు అని మావోయిస్టులే అంటునారు. పోలీసులు వేధిస్తారని అని భయం లేకుండా ఎలాంటి సంశయం లేకుండా మావోయిస్టుల జన జీవన స్రవంతి లోకి రావాలని విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. చాలా మంది ఇప్పటికే పార్టీ నుండి బయటకు వస్తున్నారు..రీసెంట్ సెంట్రల్ కమిటీ మెంబర్ సుజాతక్క కూడా లొంగిపోయారు . మావోయిస్టుల లతో మాకు ఇక్కడ సమస్య లేనపుడు వాళ్ళతో చర్చలు అనవసరం. సైబర్ సెక్యూరిటీ, ఈగల్ టీం లకు పూర్తి సహకారం ఉంటుంది. బేసిక్ పోలింగ్ & విజువల్ పోలీసింగ్ మానిటరింగ్ సిస్టమ్ ఇంప్రూవ్ చేస్తామని అన్నారు.

# జూబ్లీహిల్స్‌లో ఢీ అంటే ఢీ

- రెండు, మూడు రోజుల్లో జూబ్లీ నోటిఫికేషన్

**జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 1 :**

జూబ్లిహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికకు సంబంధించిన తుది ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఈ జా బితాలో 3,98,982 మంది ఓటర్లు ఉన్నారు, ఇందులో 2,07,367 మంది పురుషులు, 1,91,590 మంది మహిళలు, 25 ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. ఎన్నికల కమిషన్ ప్రకారం, తుది ఓటర్ల జాబితాలో గత ఎన్నికలకన్నా 1.61 శాతం ఎక్కువ మంది ఓటర్లు నమోదయ్యాయి. ఈ జాబితాలో ఉన్న 3,98,982 ఓటర్లు మొత్తం 407 పోలింగ్ స్టేషన్లలో ఓటు హక్కు వినియోగిచుకుంటారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో సగటుగా 980 ఓటర్లు ఉన్నారు. ఓటర్లు తమ పేర్లు తుది ఓటర్ల జాబితాలో ఉన్నాయో లేదో సరిచూసుకోవడానికి ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ లేదా వోటర్ హెల్ప్‌లైన్ యాప్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జాబితాలో పేర్లను చేర్చడానికి లేదా తీసివేయడానికి ఫిర్యాదులు దాఖలు చేయడానికి, ఫారం6 (పేరు చేర్చడానికి), ఫారం8 (పేరు, చిరునామా మొదలైనవి సరిచేయడానికి) ఉపయోగించవచ్చని ఈసీ తెలిపింది. కేంద్ర ఎన్నికల సంఘం అక్టోబర్ నాలుగు, ఐదు తేదీల్లో మీడియా సమావేశం ఏర్పాటు చేయనుంది. బీహార్ కు అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయనున్నారు. అదే సమయంలో జూబ్లిహిల్స్ ఉపఎన్నిక షెడ్యూల్ కూడా విడుదల చేస్తారు. బీహార్ లోనూ మంగళవారమే పూర్తి స్థాయి ఓటర్ల జాబితాను విడుదల చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేసి ఓటర్ల జాబితాను పూర్తిగా సంస్కరించారు. దాదాపుగా అరవై లక్షలకుపైగా ఓటర్లను జాబితా నుంచి తొలగించారు. మరణించిన వారు, శాశ్వతంగా వలసపోయిన వారు అలాగే.. రెండు ఓట్లు ఉన్న వారు ఇలా అందర్నీ తొలగించారు. ఈ ప్రయత్నంపై వివాదం ఏర్పడినప్పటికీ అంతా పారదర్శకంగా చేస్తున్నామని ఈసీ ప్రకటించింది. అందుకే బీహార్ ఓటర్ల జాబితాపై ఏమైనా అభ్యంతరాలు వస్తాయేమోనని ఈసీ నాలుగు రోజుల సమయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. భారత రాష్ట్ర సమితి సిట్టింగ్ సీటు కావడంతో ఎలాగైనా సీటును నెలబెట్టుకోవాలని ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. అభ్యర్థిగా దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతపేరును ఖరారు చేశారు. బీఆర్ఎస్ పార్టీ నేతలంతా విజయం కకోసం రంగంలోకి దిగారు. ఇక కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున తమ పాలనపై వ్యతిరేకత రాలేదని నిరూపించుకునేందుకు గెలిచి తీరాల్సిన పరిస్థితిలో పడింది. ఇప్పటికే కంటోన్మెంట్ ఉపఎన్నికల్లో గెలిచారు. అందుకే జూబ్లిహిల్స్ లోనూ సానుభూతి పని చేయదని.. తమ పార్టీ పాలనను మెచ్చి తమకే ఓట్లు వేస్తారని అనుకుంటున్నారు.

**త్రిముఖ పోటీ**

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలపైన ప్రధాన పార్టీలు కోటి ఆశలు పెట్టుకున్నాయి. గెలిచేది ఒక్క నియోజవర్గమైనప్పటికీ ఆ లెక్కలు అధికారపార్టీ పనితీరుకు కొలమానంగా మారబోతున్నాయనే వాదనల నేపథ్యంలో అటు అధికార పార్టీతో పాటు ఇటు సిట్టింగ్ సీటు కోసం ప్రతిపక్ష బీఆర్ఎస్, మేము కూడా తగ్గేదే లేదంటూ బిజెపిలు ఇలా త్రిముక పోరుతో జూబ్లీహిల్స్‌లో ఢీ అంటే ఢీ అంటున్నాయి. త్వరలో నోటిఫికేషన్ విడుదలకానున్న వేళ ఓటర్ల లెక్కలపై తాజాగా క్లారిటీ ఇచ్చేసింది ఎలక్షన్ కమిషన్. ఓటర్లు లెక్కలను బట్టే అభ్యర్థుల తలరాతలు మారిపోతాయి. ఇన్నాళ్లు ఊహాజనిత కథనాలు, కాకిలెక్కలు ఇక చాలంటూ తాజాగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఫైనల్ లెక్కలు విడుదల చేశారు ఎలక్షన్ కమిషన్ సీఈవో సుధర్శన్ రెడ్డి. అతి త్వరలో జరగబోయే జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికకు సంబంధించిన ఫైనల్ ఓటర్ల జాబితా ప్రకారం నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 3,99,000గా ఉందని ముఖ్య ఎన్నికల అధికారి సుధర్శన్ రెడ్డి ప్రకటించారు. జూలై 1, 2025ను అర్హత తేదీగా తీసుకుని సవరించిన జాబితాలో 2,07,382 మంది పురుషులు, 1,91,593 మంది మహిళలు, 25 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారని తెలిపారు.లింగ నిష్పత్తి ప్రకారం ప్రతి వెయ్యి పురుషులకు 924 మహిళలుగా ఉండగా, ఈ జాబితాలో 6,106 మంది యువ ఓటర్లు (18-19 సంవత్సరాలు), 2,613 మంది వృద్ధులు (80 ఏళ్లుపైబడిన వారు), అలాగే 1,891 మంది వికలాంగులు ఉన్నారు. వీరిలో 519 మంది చూపు కోల్పోయిన వారు, 667 మంది కదలికల లోపం ఉన్న వారు, 311 మంది వినికిడి/మాట లోపం కలిగిన వారు ఉన్నారు. అంతేకాదు 722 మంది ఇతర కేటగిరీలకు చెందినవారు అండగా , విదేశీ ఓటర్లు 95 మంది ఉన్నారు. సెప్టెంబర్ 2న విడుదలైన ప్రాథమిక జాబితాలో 3,92,669 ఓటర్లు ఉన్నారు. నిరంతర సవరణల తరువాత 6,976 మంది కొత్తగా చేర్చారు.



## పేదవాళ్ల కోసం అన్న క్యాంటీన్లు ఇంకా పెంచుతాం

- సిఎం చంద్రబాబు నాయుడు

**జయభేరి, అమరావతి అక్టోబర్ 1:**

పేదవాళ్ల కోసం అన్న క్యాంటీన్లు ఇంకా పెంచుతామని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. విశాఖ ఐటి హబ్ గా మారబోతుందని అన్నారు. విజయనగరం జిల్లా దత్తి గ్రామంలో సామాజిక పింఛన్ల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పేదల సేవలో ప్రజావేదిక సభలో సిఎం మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రలో రూ. 2 వేల కోట్లు ఖర్చుపెట్టి వందశాతం అన్ని ప్రాజెక్టులు పూర్తి చేస్తున్నామని, విశాఖ స్టీల్ ప్లాంట్ కాపాడామని రూ.11,400 కోట్లు ఇప్పించామని తెలియజేశారు. ప్రపంచస్థాయి కంపెనీలు విశాఖకు తరలివస్తాయని, 10, 579 మందికి వితంతు పింఛన్లు ఇచ్చామని చెప్పారు. ప్రతి నెలా ఒకటినే పింఛన్ల పండుగ చేసుకుంటున్నామని, ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని ఆనందాన్ని వ్యక్తం చేశారు. 63 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నామని అన్నారు. Also Read తొలి టెస్ట్‌కి బుమ్రా దూరం? గిల్ ఏమన్నాడంటే.. ఈ 16 నెలల్లో పేదలకు రూ. 48,019 కోట్లు ఇచ్చామని చెప్పారు. గతంలో ఒక నెల తీసుకోకపోతే ఇచ్చేవాళ్లు కాదని.. ఇప్పుడు తర్వాత నెలలో కూడా తీసుకోవచ్చునని తెలిపారు. పింఛన్ల పంపిణీ సమయంలో ఎక్కడ ఉంటే అక్కడ తీసుకునే అవకాశం ఇస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. పింఛన్ సొమ్మును పది రెట్లు పెంచిన ఘనత టిడిపిది అని కొనియాడారు. మహిళలను అన్ని రంగాల్లో పైకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని, సూపర్ సిక్స్ ను సూపర్ హిట్ చేశామని చంద్రబాబు పేర్కొన్నారు. ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనం ఇస్తున్నామని, మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని అన్నారు. ప్రతినెలా ఒక గ్రామానికి నేరుగా వచ్చి తానే పర్యవేక్షిస్తున్నానని, 2 కోట్ల 66 లక్షల గ్యాస్ సిలిండర్లు ఇచ్చామని, రూ. 1,718 కోట్లు ఖర్చు పెట్టామని చెప్పారు. ఆడబిడ్డల కోసం ఆగష్టు 15న స్త్రీశక్తి పథకం తీసుకొచ్చామని, ఒకప్పుడు పది లక్షల మందే బస్సులు ఎక్కేవారని.. ఇప్పుడు డబుల్ అయిందని ప్రశంసించారు. ఆడబిడ్డలు ఆర్థికంగా ఎదగాలన్నదే తమ ఉద్దేశం అని చంద్రబాబు స్పష్టం చేశారు.

## స్త్రీశక్తి పథకానికి విశేష స్పందన

**జయభేరి, శ్రీకాకుళం:**

స్త్రీశక్తి పథకానికి విశేష స్పందన లభిస్తోంది మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ పథకం కింద మహిళలు 90% మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారని వెల్లడించారు. రాబోయే ఏడాదిలో ప్రతి గ్రామానికి ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం మహిళల ప్రయాణాన్ని సులభతరం చేయడంలో కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.

## అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు

**జయభేరి, ఒంగోలు:**

పేదల ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు.ఒంగోలులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారన్నారు.



# సమైక్యతను పెంచే గొప్ప కళ సినిమా

'ఓ సెలబ్రేషన్‌లా సినిమా రిలీజ్ కావడం చాలా అరుదు. 'ఓజీ' విషయంలో అది జరిగింది. అలాంటి అవకాశం ఇచ్చినందుకు ప్రేక్షకులందరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. సినిమా హీలింగ్ ఆర్ట్. అభిప్రాయభేదాలున్న వ్యక్తుల్ని కూడా కలుపుతుంది. మనలో సమైక్యతను పెంచే గొప్ప కళ సినిమా' అన్నారు అగ్ర హీరో పవన్‌కల్యాణ్. ఆయన కథానాయకుడిగా సుజిత్ దర్శకత్వంలో డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై డీవీవీ దానయ్య నిర్మించిన 'ఓజీ' చిత్రం ఇటీవలే విడుదలై విజయపథంలో పయనిస్తున్నది.

# మాస్‌జాతర వచ్చేది ఆరోజే!



రవితేజ 'మాస్ జాతర' రిలీజ్ ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన విషయం తెలిసిందే. దీంతో ఈ సినిమా ఎప్పుడొస్తుందోనని అభిమానుల్లో ఆతృత పెరిగింది. తాజాగా బుధవారం మేకర్స్ కొత్త విడుదల తేదీని ప్రకటించారు. ఈ నెల 31న పక్కాగా రాబోతున్నామని తెలిపారు. రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా పోస్టర్‌తో పాటు ఓ వీడియోను విడుదల చేశారు. ఈ చిత్రంలో పోలీస్‌ఆఫీసర్ లక్ష్మణ్ భేరీ పాత్రలో కనిపించనున్నారు రవితేజ.



# నైజాం మూవీ లవర్స్‌కు నిరాశే.

శాండల్‌వుడ్ స్టార్ రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో రిషబ్ శెట్టి, రుక్మిణి వసంత్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న కాంతార ప్రీక్వెల్ ప్రాజెక్ట్ కాంతార చాప్టర్ 1. ఈ మూవీ తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇప్పటికే విడుదల చేసిన ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన వస్తోంది. మరికొన్ని గంటల్లో సినిమా థియేటర్లలో సందడి చేయనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ప్రీమియర్స్ సందడి చేసేందుకు రెడీ అవుతున్నాయి.



మెగాస్టార్ చిరంజీవి 'మన శంకరవరప్రసాద్' చిత్రంలో కథానాయిక నయనతార ప్రత్యేకాకర్షణగా నిలుస్తున్నది. సాధారణంగా ప్రమోషనల్ కార్యక్రమాలకు దూరంగా ఉండే ఈ మలయాళీ సుందరి ఈ సినిమా విషయంలో మాత్రం పట్టువిడుపులు ప్రదర్శిస్తున్నది. ఈ ప్రాజెక్ట్‌లోకి ఎంట్రీ అయింది మొదలు ప్రచార కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ అందరిలో కొత్త జోష్ నింపుతున్నది. ఏదిఏమైనా నయనతారలో వచ్చిన ఈ మార్పును అందరూ స్వాగతిస్తున్నారు. అనిల్‌రావిపూడి దర్శకత్వంలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం షూటింగ్‌ను జరుపుకుంటున్నది. ఈ నేపథ్యంలో బుధవారం శశిరేఖ పాత్రలో నయనతార ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఇందులో ఆమె సంప్రదాయ వస్త్రధారణలో మెరిసిపోతున్నది. పసుపురంగు చీరలో ఆమె లుక్ అదిరిపోయిందని, పండగ శోభను ప్రతిఫలిస్తున్నదని ఆమె అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ సినిమాలో శంకరవరప్రసాద్, శశిరేఖ మధ్య అద్భుతమైన కెమిస్ట్రీ పండిందని, వారి ప్రేమాయణం అందరిని అలరిస్తుందని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సమీర్‌రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, నిర్మాణ సంస్థ: షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్, రచనదర్శకత్వం: అనిల్ రావిపూడి.

# శశిరేఖ వలపు ముచ్చట్లు..

# ఎన్టీఆర్ బామ్మర్ది పెళ్లికి వేళాయే.. ముహూర్తం ఎప్పుడు ఫిక్స్ చేశారంటే?



టాలీవుడ్ స్టార్ హీరో ఎన్టీఆర్ బామ్మర్ది నార్నే నితిన్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.2023 అక్టోబర్ 6న 'మ్యాడ్' (Mad) చిత్రంతో ప్రేక్షకులని అలరించాడు ఈ సినిమాలో నార్నే నితిన్, సంగీత శోభన్ , రామ్ నితిన్ కీలక పాత్రలు పోషించారు. అయితే ఇందులో మేకర్స్ మాత్రం సంగీత్ శోభన్ హీరో అన్నట్టుగా ప్రాజెక్ట్ చేశారు. అందుకే సంగీత్ శోభన్ కే డెబ్యూ హీరోగా ఫిల్మ్ ఫేర్ అవార్డ్ కూడా దక్కింది. ఇక 2024 ఆగస్ట్ 15న నితిన్ నటించిన (Aay) మూవీ వచ్చింది. ఈ సినిమాలో నార్నే నితిన్ సోలో హీరోగా నటించి మంచి విజయాన్ని అందుకున్నాడు. ఇక 'మ్యాడ్'కు సీక్వెల్ గా వచ్చిన 'మ్యాడ్ స్క్వేర్' మార్చి 28న విడుదలై సూపర్ సక్సెస్ అందుకుంది.

మ్యాడ్'ను తెరకెక్కించిన కళ్యాణ్ శంకరే ఈ మూవీనీ డైరెక్ట్ చేయగా, చిత్ర క్లైమాక్స్ లో అసలు సిసలు ట్విస్ట్ ఇచ్చేది నార్నే నితినే! సో.. ఈ మూవీ వరకూ అతనే హీరో అని చెప్పాలి. ఇక నార్నే నితిన్ నటించిన శ్రీ శ్రీ రాజావారు చిత్రం విడుదల కావల్సి ఉంది. ఇక కొద్ది రోజుల క్రితం నితిన్.. శివానీ అనే యువతిని నిశ్చితార్థం చేసుకున్న విషయం తెలిసిందే. నవంబర్ 3న హైదరాబాద్‌లో వీరి నిశ్చితార్థం గ్రాండ్‌గా జరిగింది. కుటుంబ సభ్యులు, సినీ ప్రముఖుల సమక్షంలో ఈ వేడుక ఎంతో అట్టహాసంగా జరిగింది.

ఈ ఎంగేజ్‌మెంట్ ఫంక్షన్‌కు ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు, హీరో కళ్యాణ్ రామ్, వెంకటేష్, రానా దగ్గుబాటి, హారిక హాసిని ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత చినబాబు, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రొడ్యూసర్ నాగవంశీ తదితరులు హాజరై నూతన జంటకు ఆశీర్వాదాలు అందించారు. ఎన్టీఆర్ భార్య లక్ష్మీ ప్రణతి తన కుమారులు అభయ్, భార్గవ్ తో కలిసి వేడుకలో సందడి చేసింది. కాగా, శివానీ టాలీవుడ్ సీనియర్ హీరో దగ్గుబాటి వెంకటేష్ కు కజిన్ డాటర్ అవుతుంది. ఆమె తల్లిదండ్రులు తాళ్లూరి వెంకట కృష్ణప్రసాద్ - స్వరూప దంపతులు. నార్నే - దగ్గుబాటి కుటుంబాలు ఈ నిశ్చితార్థంతో సంబంధాలు కుదుర్చుకున్నాయి.ఇక పెళ్లి ఎప్పుడా అని అందరు ఆసక్తిగా ఎదురు చూస్తుండగా, తాజాగా ఓ విషయం బయటకు వచ్చింది. అక్టోబర్ 10న ముహూర్తం ఫిక్స్ చేసినట్టు టాక్. ఇప్పటికే పెళ్లికి సంబంధించిన పనులు మొదలైనట్టు తెలుస్తుంది.

Printed and Published, Editor & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com